నిర్లక్ష్యపు ఆనవాళ్లు!

- అసంపూర్తిగా సచివాలయ భవనాలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన వైనం

చెన్నేకొత్తపల్లి: మండలంలోని అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవనాలు కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యానికి ఆనవాళ్లుగా దర్శనమిస్తున్నాయి. మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లకుండా ఉన్న గ్రామాల్లో అన్ని ప్రభుత్వ సేవలు అందించేందుకు వీలుగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. మండలంలో 15 గ్రామ పంచాయతీలుండగా జనాభా ప్రాతిపదికన అప్పటి ప్రభుత్వం 11 సచివాలయాలు మంజూరు చేసింది. ఒక్కో భవనానికి దాదాపు రూ.40 లక్షల చొప్పున నిధులు కేటాయించింది.

ప్రారంభించేదెన్నడు?

మండలంలోని 11 సచివాలయ భవనాల్లో ఏడింటిని గత ప్రభుత్వంలోనే పూర్తి చేయడంతోపాటు మూడింటిని వినియోగంలోకి తెచ్చారు. ఇక చెన్నేకొత్తపల్లి-2, న్యామద్దెల-1 న్యామద్దెల-2, వెంకటంపల్లి సచివాలయ భవనాలు పూర్తయినా వినియోగానికి నోచుకోవడం లేదు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో భవనాలను ప్రభుత్వానికి అప్పగించలేదని తెలుస్తోంది. ప్యాదిండి, ముష్టికోవెల, గంగినేపల్లి, చెన్నేకొత్తపల్లి-1 భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి.


ముష్టికోవెల వద్ద నిలిచిపోయిన భవన నిర్మాణం

దిష్టిబొమ్మల్లా భవనాలు..

చెన్నేకొత్తపల్లి-2, న్యామద్దెల-1 న్యామద్దెల-2, వెంకటంపల్లిలో పూర్తయిన సచివాలయ భవనాలను ప్రారంభించకపోవడంతో దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. భవనాలు నిరుపయోగంగా ఉండటడంతో అసాంఘిక కార్యకాలపాలకు అడ్డాగా మారాయి. మరో వైపు ఆయా గ్రామాల్లో సచివాలయాలను అద్దె, పంచాయతీకి సంబంధించిన ఇరుకు గదుల్లో నిర్వహిస్తుండటంతో సచివాలయ ఉద్యోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం పూర్తయిన భవనాలను ప్రారంభించడంతోపాటు అసంపూర్తిగా ఉన్న వాటిని పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

మండలంలో 7 గ్రామసచివాలయ భవనాల నిర్మాణం పూర్తయింది. పెండింగ్‌లో ఉన్న మిగతా భవనాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే భవన నిర్మాణాలను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తాం.

– అశోక్ నాయక్, ఈఓఆర్డీ, చెన్నేకొత్తపల్లి మండలం



న్యామద్దెలలో నిరుపయోగంగా ఉన్న గ్రామ సచివాలయ భవనం

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని నిరసన


ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైన యూనియన్ నాయకులు, కార్మికులు

కదిరి అర్బన్: సమస్యలు పరిష్కరించాలని ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎర్రబ్యాడ్జీలు ధరించి, విధులకు హాజరై నిరసన తెలియజేశారు. నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముందుగా నూతన బస్సులు కొనుగోలుతో పాటు సిబ్బంది నియామకాలు, ప్రమోషన్లు కల్పించాలన్నారు. ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈయూ రాష్ట్ర కార్యదర్శి నబీ రసూల్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జీవీపీ రావ్, శ్రీనివాసులు, ఆర్ఎస్ రెడ్డి, శంకరప్ప, కార్మికులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమొంటోలు అందిస్తున్న అతిథులు

ధర్మవరం అర్బన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పుడమి తల్లి రుణం తీర్చుకోవాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, మై భారత్ ప్రోగ్రాం ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, స్టేట్ కోఆర్డినేటర్ బిసాతి భరత్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం మై భారత్ ప్రగతి పథం యూత్ అసోసియేషన్, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ వర్షాకాలం కాలంలో విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో విద్యార్థుల చేత మొక్కలు నాటించారు. అనంతరం పెయింటింగ్ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమొంటోలు అందించారు. అధ్యాపకులు రాజేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జయమారుతి, విద్యార్థులు పాల్గొన్నారు.

సహకార రంగంపై అవగాహన


విద్యార్థులకు సహకార రంగంపై అవగాహన కల్పిస్తున్న గొట్లూరు సొసైటీ అధికారులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని నెహ్రూనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ సహకార వారోత్సవాల్లో భాగంగా గొట్లూరు సొసైటీ అధికారులు విద్యార్థులకు సహకార రంగంపై అవగాహన కల్పించారు. సహకార సంఘం సబ్ డివిజన్ అధికారులు ఫణిరాజ్, చంద్రమోహన్, వెంకటేష్, దాసు, రాజు, సీఈఓ నారాయణస్వామి సొసైటీ ద్వారా రైతులు, ప్రజలకు అందిస్తున్న సేవలను తెలియజేశారు. ఏడీసీసీబీ బ్యాంకు మేనేజర్ నాగార్జున, సూపర్‌వైజర్ మహేష్, నాగభద్ర, నరసింహారెడ్డి, అపర్ణ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


శాకంబరిదేవి అలంకరణలో పెద్దమ్మతల్లి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సాలేవీధిలో నున్న పెద్దమ్మతల్లి ఆలయంలో ఆషాఢమాసం వారాహి నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు బాగా పడి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ పెద్దమ్మతల్లిని శాకంబరిదేవిగా అలంకరించినట్లు అర్చకులు వెంకటేష్ శర్మ తెలిపారు. బుగ్గ వంశస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు లలితా సహస్రనామం పారాయణం చేశారు.

ఇంటర్‌లో ప్రవేశానికి గడువు పొడిగింపు

ధర్మవరం అర్బన్: ఇంటర్‌లో ప్రవేశానికి ఈనెల 31 వరకు గడువు పొడిగిస్తున్నట్లు ప్రభుత్వ బాలికల, బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లు వనిత, ప్రశాంతి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాలుర కళాశాలలో హెచ్ఈసీ, సీఈసీ, బైపీసీ, ఎంపీసీ, ఎంఎల్‌టీ, సెరికల్చర్ గ్రూపులు, బాలికల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ గ్రూపులు, ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ దితర గ్రూపులు ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఈయూ నాయకులు

ధర్మవరం అర్బన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకులు కేబి నాగార్జునరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట శుక్రవారం ఎర్రబ్యాడ్జీల ధరించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాగార్జునరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వద్దనున్న పదోన్నతుల ఫైల్‌కు వెంటనే అనుమతులు ఇవ్వాలన్నారు. ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ కోసం డిపో ప్రైవేటు ఆపరేటర్లకు లీజుకు ఇచ్చే విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ద్వారా ఇవ్వాల్సిన పెండింగ్ డీఏ బకాయిలు 11వ పీఆర్సీ అరియర్స్ 24నెలల బకాయిలను వెంటనే ఆర్టీసీ ఉద్యోగులకు చెల్లించాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఐఆర్ ప్రకటించాలన్నారు. రిటైర్డ్ అయిన ఆర్టీసీ ఉద్యోగులకు గ్రాట్యుటీ, టెర్మినల్ ఎన్‌క్యాష్‌మెంట్‌ను ప్రభుత్వం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాలం చెల్లిన బస్సుల బ్రేక్ డౌన్‌కు గ్యారేజ్ సిబ్బందిని బాధ్యులను చేసి అక్రమంగా పనిష్‌మెంట్లు ఇస్తున్న విధానాన్ని అరికట్టాలని కోరారు. యూనియన్ రీజనల్ జాయింట్ కార్యదర్శి బి.నరసింహులు, రీజనల్ ప్రచార కార్యదర్శి బుల్లె ఆదినారాయణ, టిఐ పెద్దక్క, జోనల్ కమిటీ సభ్యులు అరుణమ్మ, గ్యారేజ్ కార్యదర్శి మల్లికార్జున, సిస్టమ్ సూపర్‌వైజర్ సుధాకర్, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ నేత లక్ష్మన్న, ఉద్యోగులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చిన్నసరిగెత్తు


కనగానపల్లిలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం


చావిడిలో కొలువుదీరిన పీర్లు

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం ఉత్సవాల్లో శుక్రవారం చిన్నసరిగెత్తు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లను ప్రత్యేకంగా అలంకరించి చక్కెర చదివింపులు చేశారు. ఇక కనగానపల్లిలో జరుగుతున్న దస్తగిరి స్వామి ఉత్సవాల్లో స్థానిక గ్రామస్తులు చింతమేకల పెద్ద నల్లప్ప కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేపట్టారు. చుట్టు పక్కల గ్రామస్తులతో పాటు కర్నూలు, కృష్ణా, గోదావరి జిల్లాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

పుట్టపర్తి టౌన్: తమ న్యాయపరమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సమస్యల పరిష్కారం కోసం పుట్టపర్తి ఆర్టీసీ ఎదుట ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలన్నారు. ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలి, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెరుగుతున్న ప్రయాణికుల అనుగునంగా 3 వేలు కొత్త బస్సులు కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జీవైపీ రావు, రీజనల్ కమిటీ సభ్యులు శంకర్, డిపో సెక్రటరీ సాధిక్‌పీరా, నాయకులు ఆనంద్, జీఆర్ బాబు, హరిలాల్‌నాయక్, మోహన్, ఖలీల్‌బాషా, జగదీష్‌నాయక్, రమణమ్మ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం సీసీ తండాకు చెందిన సంకుబాయి కుమారుడు 9వ తరగతి చదువుతున్న విద్యార్థి హేమంత్ నాయక్ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ కృష్ణమూర్తి, మృతుడి తల్లి సంకుబాయి వివరాల మేరకు... హేమంత్ (14) మారాలలో 9వ తరగతి చదుతున్నాడు. స్కూల్‌కు సరిగ్గా పోవడం లేదని తల్లి సంకుబాయి మందలించింది. ఈ నేపథ్యంలో ఈ నెల 2న విద్యార్థి హేమంత్ క్షణికావేశంలో బాత్‌రూమ్‌లో ఉన్న పురుగుల మందు తాగాడు. వెంటనే అతన్ని బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పారిశుధ్య పనుల పరిశీలన


కదిరికుంట్లపల్లిలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ పోలప్ప

కదిరి అర్బన్: మండలంలోని కదిరికుంట్లపల్లిలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఎంపీడీఓ పోలప్ప శుక్రవారం పర్యవేక్షించారు. తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని సిబ్బందికి సూచించారు. రోడ్డు, కాలువలపై చెత్తవేయకుండా గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్ పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ


పట్నంలో డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: మండల పరిధిలోని పట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ డెంగీ మాసోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో పట్నం వైద్యాధికారి డా. వినోద్‌కుమార్, సబ్ యూనిట్ అధికారి దేవలానాయక్, సూపర్‌వైజర్ శశిధర్, హెల్త్ అసిస్టెంట్ మున్నా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి


బత్తలపల్లిలో అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు


నల్లచెరువులో అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

బత్తలపల్లి: మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఎంపీడీఓ నరసింహనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికారులు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ అల్లూరి సీతారామరాజు పోరాటాలను వివరించారు. కార్యక్రమంలో ఉప మండల పరిషత్తు అభివృద్ధి అధికారి క్రిష్టప్ప, పరిపాలన అధికారి శ్రీనివాసులు, ఉపాధి హామీ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లచెరువు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రఘునాథగుప్త ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 108వ జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ రామకృష్ణ, స్వచ్ఛ భారత్ రీసోర్స్ కోఆర్డినేటర్ విశ్వేశ్వర, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రజిత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ధర్మవరంలో అల్లూరి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్డీఓ మహేష్, సిబ్బంది

ధర్మవరం రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం ఆర్డీఓ మహేష్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్డీఓతో పాటు కార్యాలయ సిబ్బంది అల్లూరి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అల్లూరి సీతారామరాజు ప్రాణాలు అర్పించారని కొనియాడారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'పీఎం సూర్య ఘర్'ను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి టౌన్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ (సోలార్) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని దత్త ఫంక్షన్ హాల్‌లో విద్యుత్ వినియోగదారుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వి.వి.ఎస్.శర్మ, విద్యుత్ ఎస్ఈ కొమ్ము సంపత్‌కుమార్, డీఈ మోజెస్, విద్యుత్ ఏఈలు శ్రీనివాస నాయక్, చెన్నకృష్ణ, ఉమాశంకర్, ట్రాన్స్‌కో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రస్తా సమస్య పరిష్కరించండి


తహసీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న రైతులు

ముదిగుబ్బ: నల్లచెర్లోపల్లి సమీపంలో నెలకొన్న రస్తా సమస్యను పరిష్కరించాలని రైతులు శుక్రవారం తహసీల్దార్ నారాయణస్వామిని కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 200 ఎకరాల పొలాలకు వెళ్లేందుకు వున్న రస్తాను ఒక వ్యక్తి మూసి వేశాడన్నారు. స్పందించిన తహసీల్దార్ వీలైనంత త్వరగా రస్తా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

పత్తి రైతులను ఆదుకోవాలి

మడకశిర: నియోజకవర్గంలో విత్తన పత్తి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు వినతిపత్రాన్ని అందించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, కుంచిటి వక్కలిగ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు రంగేగౌడ్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు శేషాద్రి, బూత్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జునగౌడ్, రైతు విభాగం అధ్యక్షుడు గంగాధరప్ప తదితరులు ఏఓ తిమ్మప్ప, రెవెన్యూశాఖ అధికారులను కలిసి న్యాయం చేయాలని కోరారు.

సోషల్ మీడియా కార్యకర్తలకు బెయిల్

మడకశిర: గుండుమలకు చెందిన సోషల్ మీడియా కార్యకర్తలు ప్రసాద్, చంద్రశేఖర్, సోమశేఖర్‌కు శుక్రవారం బెయిల్ మంజూరైనట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది వైసీ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌పై అసభ్యకరమైన పోస్టులు పెట్టారంటూ టీడీపీ నాయకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారన్నారు. వారిని పోలీసులు మడకశిర కోర్టులో హాజరు పరచగా బెయిల్ మంజూరైనట్లు పేర్కొన్నారు. బెయిల్ మంజూరు కావడంపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు శేషాద్రి, బూత్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జునగౌడ్, మధు, సికిందర్, రంగనాథ్, మాజీ డైరెక్టర్ గగన హర్షం వ్యక్తం చేశారు.

దళితులంటే చంద్రబాబుకు చిన్నచూపు

మడకశిర: గుంటూరు జిల్లా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దళితుడైన చీలి సింగయ్యను ముఖ్యమంత్రి చంద్రబాబు కించపరిచేలా కుక్కతో పోల్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి తెలిపారు. ఆయన శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ విషయంలో సీఎం చంద్రబాబు దళిత జాతికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు మాటలతో మాదిగ సామాజిక వర్గం మనోభావాలు దెబ్బతినే విధంగా ఉన్నాయన్నారు. గతంలో కూడా చంద్రబాబు ఎస్సీలుగా ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా? అని కించపరిచారన్నారు. ఇప్పటికైనా దళితులను కించపరిచే విధంగా మాట్లాడడం మానుకొని, దళితుల సంక్షేమానికి ప్రాధాన్యతం ఇవ్వాలన్నారు.

డాక్టరేట్ గ్రహీతకు సన్మానం


జయనందనరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: ఇటీవల గౌరవ డాక్టరేట్ పొందిన విశాలాంధ్ర దినపత్రిక బ్యూరో జయనందనరెడ్డిని శుక్రవారం ముదిగుబ్బలో పాత్రికేయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి విశాలాంధ్ర పత్రిక ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల బ్రాంచ్ మేనేజర్ నాగరాజ్‌తో పాటు సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ కాటమయ్య, సీపీఐ ముదిగుబ్బ మండల కన్వీనర్ చల్లా శ్రీనివాసులు హాజరయ్యారు. జయనందనరెడ్డి పాత్రికేయ రంగంలోనే కాక సామాజిక సేవా రంగంలో విశేష సేవలందించారని వారు కొనియాడారు.

జూదరుల అరెస్టు

తలుపుల : మండలంలోని ఓబీఆర్ కొత్తపల్లిలో పేకాట స్థావరంపై దాడి చేసి, ఆరుగురు అరెస్టు చేసినట్లు ఎస్ఐ నరసింహుడు శుక్రవారం తెలిపారు. వారి నుంచి రూ.7,270 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి


విద్యార్థులకు విద్యాసామగ్రి అందిస్తున్న దాతలు, ఎంఈఓ సుధాకర్‌నాయక్

బత్తలపల్లి: గ్రామాల అభివృద్ధిలో యువత, ఉద్యోగులు భాగస్వాములు కావాలని ఎంఈఓ సుధాకర్ నాయక్ సూచించారు. శుక్రవారం ఈదుల ముష్టూరు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు చిట్టిబాల ఓబిరెడ్డి, పిన్నదరి గ్రామానికి చెందిన రాజు, భూదనంపల్లి గ్రామానికి చెందిన శివారెడ్డి రూ.15 వేలు విలువైన విద్యాసామగ్రి అందజేశారు. ఎంఈఓ సుధాకర్‌నాయక్, పాఠశాల సర్పంచు ముసలప్ప, విద్యాకమిటీ చైర్మన్ శివయ్య, హెచ్ఎం రఘురాములు, నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు మాచర్ల రాజు, ఓబయ్య, వెంకట్‌నాయుడు, నాగోజీరావు, విజయనిర్మల, భాగ్యలక్ష్మి, భారతి పాల్గొన్నారు.

మా జీవితాల్లో వెలుగులు నింపింది వైఎస్సారే


వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పాల ఏకిరి సంఘం నాయకులు

నల్లమాడ: తమ జీవితాల్లో వెలుగులు నింపింది దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డేనని పాల ఏకిరి సంఘం నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి వారు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాల ఏకిరి సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి అశ్వర్థనాయుడు, నాయకులు నాగరాజునాయుడు, చంద్రానాయుడు తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలోని పాల ఏకిరి కులస్తులను గుర్తించి 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బీసీ-ఏ జాబితాలో చేరుస్తూ జీఓ ఎంఎస్ నంబర్ 23 విడుదల చేశారన్నారు. పాల ఏకిరి కులస్తులను బీసీ జాబితాలో చేర్చి నేటికి 17 సంవత్సరాలు అయిన సందర్భంగా వైఎస్సార్‌ను స్మరించుకుంటూ ఆ మహానేత విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించామన్నారు. అలాగే మాజీ సీఎం వైఎస్ జగన్ పాల ఏకిరి కార్పొరేషన్ ఏర్పాటు చేసి పాల ఏకిరి కులస్తుల అభివృద్ధికి దోహదపడ్డారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు చిన్నరాంనాయుడు, నరసింహానాయుడు, పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం


మాట్లాడుతున్న ఎంపీడీఓ రామానాయక్

తనకల్లు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీఓ రామానాయక్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మరియమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

గాండ్లపెంట: ఎన్పీకుంట మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు, బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులను ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు, ఎంఈఓ గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో సన్మానించారు. శుక్రవారం స్థానిక ఎంఆర్‌సీలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.